
# అప్పో దీపో భవ



బ్రహ్మర్షి పత్రీజీ

# " అప్పో దీపో భవ !"

మై డియర్ ఫ్రెండ్స్ ! మై డియర్ మాస్టర్స్ అండ్ మై డియర్ గాడ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ !

ధ్యాన మిత్రులారా ! ఈ రోజు అత్యద్భుతమైన, అత్యంత మౌలికమైన "అప్పో దీపో భవ " అన్న సూత్రాన్ని మనం విశేషంగా తెలుసుకుందాం.

ఈ సూత్రం తెలియకే అందరూ సతమతమవుతున్నారు., దుఃఖంతో జీవిస్తున్నారు. గౌతమ బుద్ధుడు తన జీవిత చివరి దశలో ఆఖరి శ్వాస వదిలి పెట్టే ముందర తన శిష్యుడు ఆనందుడికి ఇచ్చిన ప్రభోధం ! ఈ మాటల తర్వాత బుద్ధుడు మాట్లాడలేదు. ఆ చివరి మాటలు ఆయన యొక్క పదాలలో "అప్పో దీపో భవ", అంటే పాళీ భాషలో "ఎవరి దీపాన్నీ వాళ్ళే వెలిగించుకోవాలి."

"ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. మన జీవితాన్ని ఇంకొకళ్ళ చేతుల్లో పెడితే 'వాళ్ళు ఉద్ధరిస్తారులే' అని మనం అనుకుంటే వారి మీద ఆధారపడితే.... కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లే ! అన్నాడు గౌతము బుద్ధుడు ! ఏ బుద్ధుడైనా ఏ బుద్ధిలేని వాడికైనా చెప్పేది ఇది ఒక్కటే "నిన్ను నువ్వు వెలిగించుకోవడంలోనే నీ బుద్ధి ఉన్నది" అని.

ఇంకొకడి మీద ఆధారపడితే నువ్వు బుద్ధిలేని వాడివి. నీ కాళ్ళ మీద నువ్వే నిలబడాలి.... నీ జీవితాన్ని నువ్వే సరిదిద్దుకోవాలి ! "ఓ దేవుడా ! నా కొడుకుకి ఉద్యోగమియ్యి ! నా కూతురికి పెళ్ళి చెయ్యి ! నా కొడుకుకి ఉద్యోగమియ్యి ! నా కూతురికి పెళ్లి చెయ్యి ! నా కడుపులో కాన్సర్ తీసెయ్యి !" ఎవరున్నారు తీసే నాథుడు ? నీ కొడుకుకి ఉద్యోగం ఇచ్చే నాథుడు పైన ఎవరున్నారు ? అక్కడ ఏమీ లేదు.... శూన్యం ఉంది. నీ కూతురికి పెళ్ళి చేసే వాళ్ళెవరున్నారు ? పైన ఎవ్వరూ లేరు. నువ్వే కష్టపడి నీ యొక్క కొడుకుకి సహాయం చేయాలి. నీ కొడుకు ఉద్యోగం చేయాలంటే నీ కొడుకు కష్టపడాలి. నువ్వేం చేస్తావు ? నీ కూతురి పెళ్ళి చేయ్యాలంటే నీ కూతురు తన పెళ్ళి తాను చేసుకోవాలి. నువ్వేం చేస్తావు నీకూతురి పెళ్ళి ? కూతురు ఎదిగినప్పుడు తన పెళ్ళి తానే చేసుకోవాలి. కొడుకు ఎదిగి వచ్చినప్పుడు తన ఉద్యోగాన్ని తానే వెతుక్కోవాలి. నీ కడుపు నొప్పి నువ్వే నయం చేసుకోవాలి ! నీ కడుపు నొప్పిని డాక్టర్ ఎలా బాగు చేస్తాడు ? వచ్చింది నీకు.... నీకూ అతనికీ సంబంధం ఏమిటి ? ఒక మనిషికీ ఇంకొక మనిషికీ సంబంధం లేదు కదా !

"పండిత పుత్రఃపరమ శుంఠః".... నువ్వు కష్టపడి పాసయ్యావు. నువ్వు మంచి ఉద్యోగం సంపాదించావు. నీ కొడుకు కూడా కష్టపడి చదివితే పాసయితే ఉద్యోగం సంపాదించుకుంటాడు. వాడేమో కష్టపడడు. నువ్వేమో ఉద్యోగం ఇస్తానంటే ఎలా కుదురుతుంది. చెల్లదు ! మిత్రులారా చెల్లదు ! ఎవరి ఉద్యోగాన్ని వాళ్ళే చేసుకోవాలి. ఎవరి తలకాయ నొప్పిని వాళ్ళే తీసేసుకోవాలి. ఎవరి వృత్తిని వారే సంపాదించుకోవాలి. ఎవరి దుఃఖాన్ని వారే పోగొట్టుకోవాలి.

ఎవరికి వారే యమునా తీరే ! ఎవరికి వారే కర్మ తీరే ! ఎవరికి వారే జీవనతీరే ! నీ జీవితాన్ని నువ్వు చూసుకోవాలి !

తల్లితండ్రులు పిల్లల్ని కేవలం పుట్టించగలరు. పెంచగలరు. కానీ వాళ్ళ జీవితాన్ని చూసుకోవాల్సిన బాధ్యత వాళ్ళదే. వాడు మొండికేసి చదవడు.... నువ్వేం చేస్తావు ? అస్సలు నువ్వేమీ చెయ్యలేవు.

మిత్రులారా ! ఈ మొత్తం అవగాహన ఉందే.... అది మౌలికమైన అవగాహన. మానవుడి జీవితంలో "పక్కవాడు చేస్తాడులే ! నా తల్లి సంపాదించింది గదా ! నా తండ్రి సంపాందించాడు గదా ! నేను ఎందుకు ఉద్యోగం చెయ్యాలి".... అని ఒక్కక్షణం మెరుపు జీవితం జీవిస్తాడు; మిగతా జీవితమంతా అంధకారం అనుభవిస్తాడు.

ఎవరి కాళ్ళ మీద వాళ్ళే నిలబడాలి ! "అప్పో దీపో భవ !" ఎవరి ఆత్మ దీపాన్ని.... ఎవరి మానసిక దీపాన్ని, ఎవరి బుద్ధి దీపాన్ని, ఎవరి శరీరాన్ని.... వారే వెలిగించుకోవాలి; రక్షించుకోవాలి. You cannot afford to depend upon others! పరాధీనపు బ్రతుకు అన్నది ***చీకటి బ్రతుకు !*** స్వాధీనపు బ్రతుకు ***వెలుగు బ్రతుకు!*** దీపం అంటే వెలుగు ! పక్కవాడు నిన్ను వెలిగించ జాలడు. నిన్ను నువ్వే వెలిగించుకోవాలి.

వేదవ్యాసుడు మహాభారతంలోని భవగద్గీతలో ఏం చెప్పాడంటే :

**ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ ।**

**ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥**

"ఉద్ధరేత్ ఆత్మనాత్మానం" – ఎవరి ఆత్మను వారే ఉద్ధరించుకోవాలి.

"ఆత్మానమ్ అవసాదయేత్" – ఎవరి ఆత్మను వాళ్ళు దిగజార్చుకోకూడదు. తప్పుడు అనుభవాల వైపు మనస్సు పంపించకూడదు. ఆత్మ ప్రయాణాన్ని సుదూరం చేసుకోకూడదు.

ఎవరికి వారే బంధువు ! ఎవరికి వారే శత్రువు! నువ్వు మాంసం తింటే ఐదు జన్మల్లో నేర్చుకోవలిసినది యాభైజన్మలో నేర్చుకోవాల్సి వస్తుంది. అప్పుడు నీకు నువ్వే శత్రువు అయ్యావు. బాగా చికెన్ మాసాలా పట్టించి తిన్నావు. రోజుకో చికెన్ తిన్నావు. ఎంత హింస ! చచ్చావు ! యాభైఏళ్ళలో ఎంత చికెన్‌లు తిని ఎంత పాపం మూట కట్టుకుంటున్నావు ! ఎంత రక్తపాతం చేశావు ! మళ్ళీ వచ్చే జన్మలో దాని ఫలితాన్ని అనుభవించాల్సిందే గదా ! అప్పుడు నీకు నువ్వే శత్రువు అయ్యావు.

నువ్వు ధ్యానం చేశావు. పాపాన్నంతా కడుక్కున్నావు. అప్పుడు నీకు నువ్వే మిత్రుడివి అయ్యావు. ఏ రాముడో, కృష్ణుడో, శివుడో వచ్చి నిన్ను రక్షించడు. నిన్ను రక్షించుకోవాలి. అన్యథా శరణం నాస్తి ! నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి ! నేను నీకు ఏమీ చెయ్యలేను ! నాకు నువ్వు ఏమీ చెయ్యలేవు ! నేను నాకు చేసుకోగలను. నువ్వు నీకు చేసుకోగలవు. ఎవరికి వారే యమునా తీరే !

నేను ఈ శాస్త్రాన్ని.... ఆధ్యాత్మిక శాస్త్రాన్ని, జ్ఞాన శాస్త్రాన్ని.... ప్రవచించగలను, చెప్పగలను. మీకు నేర్పించలేను. మీరు నేర్చుకోగలరు. శ్రద్ధగా వింటే నేర్చుకుంటారు.... లేకపోతే లేదు ! ఒకానొక సంస్కృత పండితులు సంస్కృతం నేర్పిస్తూ ఉంటాడు క్లాసులో

నేర్చుకునేవాడు శ్రద్ధగా వింటే నేర్చుకుంటాడు. వీడికి శ్రద్ధలేకపోతే వాడు వీడికి నేర్పించలేడు.

రమణ మహర్షి ఏమన్నారంటే "గురియే గురువు". నీ యొక్క శ్రద్ధే నీ గురువు.చెప్పే వాడు నీ గురువు కాదు! వాడు చెప్పలేడు! క్లాసులో చెప్పుకుంటూ వెళుతున్నాడు. నువ్వు శ్రద్ధగా వింటే, నీకు 'గురి' ఉంటే, నువ్వు నేర్చుకుంటావు. నీకు శ్రద్ధ లేకపోతే, నీకు ఏకాగ్రత లేక పోతే, నీకు గురి లేకపోతే నేర్చుకోలేవు!

ఎవరు నేర్పిస్తున్నారు నీకు? నీ శ్రద్ధ నీకు నేర్పిస్తోంది! ఎవరు నీకు నేర్పించకుండా ఉన్నారు?.... నీ అశ్రద్ధ. నీ 'అ గురి' అంటే గురి లేక పోవడం! రమణ మహర్షి ఎంత చక్కగా చెప్పాడో....గురియే గురువు! నీ శ్రద్ధ నిన్ను పునీతుణ్ణి చేసింది. నిన్ను పవిత్రుణ్ణి చేసింది. పురోగామిని చేసింది. నీ అశ్రద్ధ వల్లనే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే లాగా ఉన్నావు. నీ జీవితం ఎంత వేగవంతంగా సాగాలో అంత వేగవంతంగా లేదు, చతికిలపడింది. ఎందుకంటే "ఎవడో వస్తాడు ఏదో చేస్తాడు, ఉద్ధరిస్తాడు" అనుకుని ప్రార్ధనలు చేస్తూ సాధనని విస్మరించావు.

గౌతమ బుద్ధుడు ఏమన్నాడంటే "అరే! భాయిసాబ్! ప్రార్థనా ఛోడో, సాధనాకో పకడో! సాధనాకో అపనావో!"

స్వామి దయానంద సరస్వతి, ఆర్య సమాజ స్థాపకుడు ఏమన్నాడంటే "మూర్తి పూజ మెట్టు కాదు అగడ్త" అన్నాడు. ప్రార్ధనను వదిలిపెట్టేసి సాధనను చేపట్టమన్నాడు. గౌతమ బుద్ధుడి లాగా సాధన చెయ్యాలి. 'సంగీత ప్రార్ధన' అన్నది ఉందా? "సంగీత సాధన" అన్నది ఉందా? శ్రీ శెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్‌లా కావాలంటే సంగీత సాధన చేయ్యాలి. బిస్మిల్లాఖాన్, పండిత్ రవిశంకర్‌లలా కావాలంటే సాధన చెయ్యాలి. వారి విగ్రహాలకు ప్రార్థన చేస్తే సంగీతం వస్తుందా? ప్రార్థనా ఛోడో, సాధనా పకడో! సాధన వల్ల నిన్ను నువ్వు ఉద్ధరించుకుంటావు. ప్రార్థన వల్ల నిన్ను నువ్వు వృధా పరుచుకుంటావు.

ఎవర్ని అర్థిస్తున్నావు? ఎవరు వచ్చి నిన్ను బాగు చేస్తారు? ఎక్కడి ప్రార్థన? పుస్తకాలు తెరవకుండా, చదకుండా పుస్తకానికి 'సరస్వతీ పూజ' చేస్తే నీకు చదువు వస్తుందా? ఎలా వస్తుంది? వీణ తీసుకుని సాధన చేయ్యకుండా వుంటే నీకు వీణ వస్తుందా? వీణకు ప్రార్థన చేస్తే వీణ వస్తుందా? రోజూ నమస్కారం పెట్టి "వీణ రా" అంటే వస్తుందా?

సాధన ! ఎవరి సాధన, ఎవరి దీక్ష, ఎవరి శ్రద్ధ .... వారికి బంధువు ! బుద్ధునికి ముందు అందరూ ప్రార్థనలు చేస్తున్నారు. అందరూ దుఃఖంగా ఉన్నారు. ఎటు చూసినా బుద్ధుడు దుఃఖాన్ని చూశాడు. ఎందుకు చూశాడు ? 'ఎందుకు' అంటే అందరూ ప్రార్థనల వల్ల అన్నీ సమకూరేటట్లయితే ఎన్ని ప్రార్థనలు జరుగుతున్నాయి, ఎన్ని పూజలు జరుగుతున్నాయి.... మరి అందరూ ఎంత ఆనంద డోలికల్లో ఉండాలి. కానీ గౌతమ బుద్ధుడు గమనించనదేమిటంటే.... 'ఒక్కడు కూడా ఆనందంగా లేడు'!

ఎన్ని గుళ్ళు, ఎన్ని మసీదులు, ఎన్ని చర్చ్‌లు, ఎన్ని కారక్రమాలు జరుగుతున్నా ఒక్కడు కూడా దుఃఖరహితంగా లేడే! ఎందుకంటే చెయ్యకూడనివి చేస్తున్నాడు. చెయ్యవలసినది చెయ్యడం లేదు. చెయ్యకూడనిది పరాధీనత! చెయ్యవలసినది స్వాధీనత ! అప్పో దీపో భవ! నీ దీపాన్ని నువ్వు వెలిగించుకోవాలి!

నూనె ఉంది. వొత్తి ఉంది. నీ చేతుల్లోనే అగ్గిపెట్టె వుండి ఎవడో వచ్చి వెలిగిస్తాడంటే.... ఎవ్వరూ వచ్చి వెలిగించరు ! ప్రమిదను వెలిగించవచ్చు.... నీ జీవితాన్ని ఎవ్వడూ వెలిగించడు ! నీ చేతికి ఎవ్వరైనా వీణ అందించవచ్చు కానీ నీకు సంగీతం ఇవ్వజాలడు. నీ చేతిలో రసాయన శాస్త్రం బుక్ పెట్టవచ్చు. నీకు రసాయన శాస్త్ర జ్ఞానాన్ని ఇవ్వజాలడు. నీ జేబులో డబ్బు పెట్టవచ్చు. కానీ నీ మనస్సులో దుఃఖాన్ని తీసెయ్యలేడు; అశాంతి తియ్యలేడు! ఇంపాజిబుల్ ! నీ విద్యను నువ్వే సంపాదించుకోవాలి. నీ మనస్సును నువ్వే శాంత పరచుకోవాలి. నీ రోగాన్ని నువ్వే నయం చేసుకోవాలి.

**" ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవరి పురాత్మనః ॥**

ఏదైతే భగవద్గీతలో చెప్పబడిందో, ఏసుక్రీస్తు కూడా అదే చెప్పాడు.

"As you Sow, So you reap" నువ్వు ఏది విత్తుతావో దాన్నే కోసుకుంటావు. వేప విత్తు వేస్తే మామిడి పండు రాదు.

**విత్తు బట్టి చెట్టు అంట!**
**కర్మ బట్టి ఫలితమంట!**
**చెడు చేస్తే చెడు అంట!**
**మంచి చేస్తే మంచి అంట!**

నువ్వు ఏది చేస్తావో దాన్నే పొందుతావు. కర్మ సిద్ధాంతం ఏం చెప్తుందంటే నీ జీవితాన్ని నువ్వు వెలిగించుకోగలవు. ఇంకొకరెవరూ వెలిగించజాలరు. ఇది అర్థం చేసుకోకపోతే ఏమవుతుంది ? తల్లితండ్రుల మీద కోపం, ఉపాధ్యాయుల మీద కోపం, సంఘం మీద కోపం, ఆ దేవుని మీద కోపం ! నువ్వేమీ చెయ్యవు.... ప్రక్కవాళ్ళ మీద కోపం ! "వాడు నాకు చెయ్యలేదు", "వాడివల్ల నేను నాశనమయ్యాను", దేవుడు నాకిలా రాసిపెట్టి ఉన్నాడు ", " నేనేం చేస్తాను ? నా చేతుల్లో ఏం ఉంది ?".... అంతా ఎంత మూర్ఖత్వం !

సర్వశక్తిమంతుడై వున్నా మానవుడు ఖిన్నుడై ఉన్నాడు. తన ద్వారా తాను వంచితుడై ఉన్నాడు. తన కంటిని తన వ్రేళ్ళతో తానే పొడుచుకుంటున్నాడు. పొడుచుకుని " దేవుడు పొడిచాడం"టున్నాడు. సంఘం పొడిచిందంటాడు. వాడి వేలు ద్వారానే వాడు వాడి కన్ను పొడుకుచుని " తల్లిదండ్రులు పొడిచారు " అంటాడు.

గౌతమ బుద్ధుడు "అప్పో దీపో భవ" అన్నా, భగవద్గీతలో "ఉద్ధరేదాత్మనాత్మానం" అన్నా, ఏసు ప్రభువు "As you Sow, So you reap" అన్నా, ఒకటే మౌలిక సూత్రం! ఒకటే మౌలిక సత్యం ! పరాధీనపు బ్రతుకుకు స్వస్తి పలకండి. స్వాధీనపు బ్రతుకుకు నాంది పలకండి. ప్రార్థనకు తిలోదకాలివ్వండి. సాధనకు హారతి పట్టండి. స్వాగతం పలకండి.

అడుక్కునే బ్రతుకు ఎప్పుడూ పేదవాడి బ్రతుకే ! కష్టపడి పని చేసేవాడి బ్రతకు రారాజు బ్రతుకు ! కనుక మై డియర్ ఫ్రెండ్స్, ఆధ్యాత్మికతలో ప్రప్రథమంగా చెప్పేదే మిటంటే.... నీ వాస్తవానికి నువ్వే సృష్టికర్తవు. నీ వాస్తవం అనేది నీనుంచే సృష్టింపబడుతుంది. నీ వాస్తవం ఆకాశం నుంచి ఊడిపడదు. వర్షంలా ధార రాదు. నీ యొక్క ఒళ్ళోకి ఏదీ తనంతట తానుగా వచ్చిపడదు. నీ ఒళ్ళోకి, నీ ఒంట్లోంచి బయటకు వచ్చినదే వచ్చిపడుతుంది. ఆకాశం నుంచి నీ ఒళ్ళోకి ఏదీ రాదు ! నీ లోపలి నుంచే ఉత్పన్నమై నీ ఒళ్ళోకివస్తుంది.

సాధకుడు తన సాధనా ఫలాన్ని తానే భుజిస్తున్నాడు. ప్రక్కవాళ్ళ సాధనా ఫలాన్ని నువ్వు భుజించజాలవు. నీ సాధనా ఫలాన్ని ప్రక్కవాడు భుజించజాలడు. నీ సాధనా ఫలాన్ని ప్రక్కవాడికి ధారపోయలేవు. అసంభవం !

కుక్కతోకను.... వంకరగా వున్న కుక్క తోకను.... కాస్సేపు పట్టుకోవడం.... అదేం తిన్నగా అయ్యింది ? దాన్ని నువ్వు పట్టుకుని ఉపయోగమేమిటి ? కుక్కతోకని

కాస్సేపు పట్టుకోగానే కుక్క సంతోషిస్తుంది. "ఆహా.... ఆహా.... నా వంకరతోక తిన్నగా అయిపోయింది కదా !" అని చెప్పేసి ! వదిలి పెట్టగానే మళ్ళీ యథాతథంగా అవుతుంది. నువ్వేం చేస్తావు ? కుక్క తోకను తిన్నగా ఎట్లా చేస్తావు ? ఇంకొక మనిషిని నువ్వెలా బాగుచేస్తావు ? ఆ భావనే.... "ఇంకొకడికి నేను వైద్యం చెయ్యగలను, ఇంకొకడి రోగాన్ని నేను తియ్యగలను".... అన్న భావనే మౌలికంగా అసత్యం !

కనుక మిత్రులారా ! "అప్పో దీపో భవ", అన్నది " Be a light unto yourself " అన్నది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ యొక్క emblem గా స్థిరపరచబడి ఉంది. ఎలాగైతే భారత ప్రభుత్వానికి "సత్యమేవ జయతే" ఉందో.... ఎలాగైతే రామకృష్ణ మిషన్‌కి "ఆత్మనో మోక్షాయ జగత్ హితాయచ" అన్న motto ఉందో .... పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్‌కు మౌలిక సూత్రం ఏమిటంటే "అప్పో దీపో భవ" "నీ దీపాన్నీ నువ్వే వెలిగించుకో". " Be a light unto yourself "

చిన్నప్పటి నుంచే ఈ సత్యాన్ని చెప్పాలి ! దీన్ని అందరూ ముసలి వాళ్ళయిన తరువాత చెప్పి ఏం లాభం ?

ఇక్కడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్‌లో ప్రతి వాడు వస్తాడు. మొట్టమొదట సారిగా వస్తాడు. "స్వామీ ధ్యానం నేర్చుకోవాలి" అని "ఒక్క క్షణం కళ్ళు రెండూ మూసుకో ! చేతుల్లో చేతులు పెట్టు ! శ్వాస మీద ధ్యాస పెట్టు ! ఇక పో" అంటాం. "స్వామీ ! నువ్వు నా ప్రాబ్లమ్‌ను తీసెయ్యలేవా ?" అంటే " నేను నీ ప్రాబ్లమ్ ఎందుకు తీసెయ్యాలి ? పో ఇక్కడి నుంచి ! సాధన చేసుకో ! అని నిష్కర్షగా అంటా ! "మా తల్లి ఆరోగ్యంగా లేదండి ! మీరేమైనా చెయ్యండి ! అంటే ... "నా తల్లికే నేనేమీ చెయ్య లేదు ! నీ తల్లికేం చేస్తాను ? నీ తల్లి ధ్యానం చేస్తే బాగుపడుతుంది ! నువ్వు కూడా నీ తల్లికి ఏమీ చెయ్యలేవు ! నీకు నేను కూడా ఏమీ చెయ్యలేను ! ఎవ్వడూ ఏమీ చెయ్యలేడు. నీ తల్లికి ధ్యానం నేర్పు !"

ఆవిడ ఇష్టపడి నేర్చుకుంటే.... నేర్చుకోవడానికైనా ఆవిడ ఇష్టపడాలి, నేర్చుకోవాలి. మా అన్నగారు నా దగ్గర ధ్యానం నేర్చుకోలేదు. నా స్వంత అన్న ! ఆయనకు ఒంటినిండా సోరియాసిస్ వచ్చింది. బాధపడుతున్నా నేను ఆయనకు నేర్పించ గలనేంటి ? ప్రపంచానికంతా ధ్యానం నేర్పించాను, ఆయన నేర్చుకోవడానికి ఇష్టపడలేదు; నేర్చుకోలేదు.

ఆయన సోరియాసిస్ రక్తం కారుతూ అలాగే ఉంటుంది. ఏం చేస్తాం మనం ? ఆయన నేర్చుకోవడానికి ఇష్టపడి ఎప్పుడైతే ధ్యానం చేస్తాడో అప్పుడు పోతుంది ! డాక్టర్ వల్ల పోదు ! మందుల వల్ల పోదు ! అది ఆయన తెలుసుకున్నప్పుడు, అది ఆచరించినప్పుడు.... సాధన చేసినప్పుడు ఆ సోరియాసిస్ పోతుంది. ఎందుకు పోదు ? మా బాబులాగా పోతుంది !

మై డియర్ ఫ్రెండ్స్ ! మై డియర్ మాస్టర్స్ ! మై డియర్ గాడ్స్ ! మీ తలకాయ నొప్పిని మీరే పోగొట్టుకోవాలి. మీ కడుపునొప్పిని మీరే పోగొట్టుకోవాలి. మీ కొడుకు చదువు మీరు చదవలేరు ! ఎవరి చదువు వారే చదవాలి. చూశారా. ఎవరి ముక్తిని వారే సంపాదించుకోవాలి.

నీ పరిముక్తిని, నీ మహాపరిముక్తిని నువ్వే సంపాదించుకోవాలి. ధ్యాన సాధన చేస్తే ముక్తి, ధ్యాన బోధన చేస్తే పరిముక్తి, జ్ఞాన ప్రచారం చేస్తే మహా పరిముక్తి ! ప్రచారం చేస్తావా....?! దాని ఫలితం పొందుతావు. ప్రచారం చెయ్యవా....?! దాని ఫలం పొందవు !

ఎవరి దీపాన్ని వారు 'సత్వరంగా' వెలిగించుకుందురు గాక ! ఎవరి జీవితాన్ని ఎవరికి వారు ఇక సత్వరంగా ఆనందమయం చేసుకుందురు గాక ! ఎవరి శరీరాన్ని వారు అఖండంగా ఇక ఆరోగ్యమయం చేసుకుందురు గాక !

మిత్రులారా ! ఎవరి దీపాన్ని వారే వెలిగించుకోవాలి. కనుక మనం ధ్యానం చేద్దాం. ఎవరు ఎంత ధ్యానం చేస్తారో అంత లబ్ది పొందుతాడు. ధ్యానమంటే శ్వాసాను సంధానం ద్వారా....చిత్తవృత్తి నిరోధం ద్వారా.... విశ్వమయ ప్రాణశక్తి ఆవాహన ద్వారా, నాడీమండల శుద్ధి ద్వారా.... దివ్యచక్షువు ఉత్తేజితం ! ఇదంతా వెరసి ధ్యానం !

ధ్యాన సాధన ద్వారానే మన జీవితంలో వెలుగులు నింపబడతాయి.

దీపావళి వస్తుంది !

అంధకారం పోయి వెలుగులు వస్తాయి !

ధ్యానం ద్వారానే దీపావళి !

ఏక్ హీ ఏక్ ధ్యాన్ విధాన్,,, నామ్ హై శ్వాసానుసంధాన్ !

అందరూ హాయిగా కూర్చుని చేతుల్లో చేతులు పెట్టుకుందాం !

కళ్ళు రెండూ మూసుకుందాం !

- బ్రహ్మర్షి పత్రీజీ

బుద్ధత్వం అంటే జ్ఞానోదయ సిద్ధి. ఈ నేపథ్యంలో గౌతమ బుద్ధుడు ప్రవచించిన నాలుగు ముఖ్య సుత్రాలు సదా శిరోధార్యం. రెండున్నర వేల సంవత్సరాల క్రితం చెప్పినప్పటికీ ఆ ఆర్యసత్యాలు ఇప్పటికీ చర్చనీయాంశం కావడంతోనే వాటి యొక్క సత్యసంధత స్పష్టమౌతూవుంది. ముఖ్యంగా ఆనాపానసతి.... శ్వాస మీద ధ్యాస.... ధ్యానంను పాటించే పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీస్ మాస్టర్లకు బుద్ధుని బోధనలు భగవద్గీతా ప్రభోధాలు !

– ఎడిటర్

# "నాలుగు ఆర్యసత్యాలు !"

"మున్నెన్నడూ వినని విషయాల మీద నాలో జ్ఞానం ఉదయించింది. !"

ఈ ఆసక్తికరమైన వాక్యం, బుద్ధుడు స్వయంగా తన ప్రజ్ఞతో కనుగొన్న నాలుగు ఆర్య సత్యాలను గురించి ప్రస్తావిస్తోంది. బుద్ధుళ్ళు వచ్చినా రాకపోయినా, సత్యాలు ఎప్పుడూ ఉంటాయి ! అటువంటి సత్యాలను ప్రతి బుద్ధుడూ ఈ ప్రపంచానికి ఆవిష్కరిస్తాడు ! అవి శాశ్వత సత్యాలు ! కాలంతో మారవు !

సామాన్యులు ఉపరితలాన్నే చూస్తారు. కానీ ఆర్యుడు వస్తువులను యాథాతథంగా – అవి వాస్తవంలో ఎలా ఉన్నాయో అలా చూస్తాడు.

*మొదటి సత్యం దుఃఖాన్ని గురించి చెబుతుంది !*

ఒక వేదనగా దుఃఖం అంటే సహించడం కష్టమైనదని.

ఎవరికైనా గానీ జననం, ముసలితనం, వ్యాధి, అంతిమంగా మరణం అన్నవి తప్పవు. ఎవ్వడూ ఈ అనివార్య దుఃఖ కారణాలకు అతీతుడు కాదు.

తీరని కోరిక కూడా దుఃఖమే !

మనం ద్వేషించే వస్తువులతో, మనుష్యులతో సంబంధం పెట్టుకోవాలనుకోము. అలాగే మనం ప్రేమించేవాటి నుంచి వేరుగా ఉండాలని కోరుకోము. మనం పెంచుకున్న కోరికలు, ఎలాగైనా, అన్ని వేళలా తీరవు! మనకు ఇష్టం లేనిదీ, కోరనిదీ మన మీద రుద్దబడుతుంది. కొన్నిసార్లు అటువంటి అనుకోని ఆశించని, అసంతోషకర పరిస్థితులు భరించరానివీ, బాధాకరాలూ అవుతాయి.

బలహీన అజ్ఞాన జనం అటువంటి పరిస్థితులలో, మార్గాంతరం లేక, ఆత్మహత్యకు.... ఆత్మహత్య తమ సమస్యలకు పరిష్కారమైనట్లు.... పాల్పడతారు.

నిజమైన సుఖం అంతరంగంలో ఉంది. సంపద, అధికారం, గౌరవాలు లేదా విషయాలలో సుఖం లేదు. అటువంటి లౌకిక ఆర్జితాలు, బలాత్కారంగా, అన్యాయంగా ఆర్జించినవైనా, అవి ప్రక్కదారి పట్టినా, వాటి మీద అనురాగం పెంచుకున్నా, అవి దుఃఖ హేతువులవుతాయి; స్వంతదారులకు దుఃఖాన్ని కలిగిస్తాయి.

***దుఃఖానికి కారణం తృష్ణ లేదా రాగం! ఇది రెండో ఆర్య సత్యం!***

"తృష్ణ నుంచి విచారం, తృష్ణ నుంచి భయం వస్తాయి; తృష్ణ నుంచి పూర్తిగా బయట పడ్డవానికి, విచారం లేదు; భయం అంతకంటే లేదు!"

ఈ తృష్ణ అనేది అందరిలోనూ ఉండే బలమైన అంతర్గత మానసిక శక్తి. జీవితంలోని అన్ని రకాల రుగ్మతలకు కారణం ఇదే. ఈ తృష్ణే.... అది స్థూలమైనా, సూక్ష్మమైనా.... సంసారంలో పునర్జన్మలకు దారితీస్తుంది. అన్ని రకాల జీవితాలకూ మనిషిని అంటి పెట్టుకునేట్టు చేసేది అదే.

మధ్యే మార్గాన్ని అనుసరించి, నిర్వాణ పరమానందాన్ని పొందినప్పుడు మాత్రమే దుఃఖం, తృష్ణ.... రెండూ కూడా ధ్వంసం అవుతాయి.

***మూడో ఆర్యసత్యం దుఃఖాన్ని పూర్తిగా నిరోధించడం!***

ఇది బౌద్ధుల పరమ లక్ష్యమైన నిర్వాణం. అన్ని రకాల తృష్ణలనూ పూర్తిగా నాశనం చేయడంతోనే ఇది సాధ్యమవుతుంది.

***నాలుగో ఆర్యసత్యం అష్టాంగ మార్గం!***

ఇది నిర్వాణాన్ని చేరే ఒకే ఒక్క తిన్నని మార్గం!

ఇది పూర్తిగా ఒక కొసకు పోయి, బుద్ధిని బలహీనం కావించే కఠోర నియమాలతో, శరీర కృశింపును చేపట్టదు, రెండో ప్రక్కకు పోయి, నైతిక ప్రగతిని అడ్డుకునే విషయ లంపటంలో మునిగిపోదు. అంటే మధేయ మార్గం ఇది.

ఇందులో ఈ దిగువ తెలిపిన ఎనిమిది అంశాలున్నాయి.

సమ్మాదిట్టి.... సమ్యక్ దృష్టి
సమ్మాసంకప్ప.... సమ్యక్ సంకల్పం
సమ్మావాచా....సమ్యక్ వచనం
సమ్మాకమ్మంత.... సమ్యక్ కర్మ
సమ్మాఅజీవ.... సమ్యక్ జీవనం
సమ్మావాయామ.... సమ్యక్ వ్యాయామం
సమ్మాసతి...... సమ్యక్ స్మృతి
సమ్మసమాధి..... సమ్యక్ సమాధి

ఒకణ్ణి మలినుని గానో, అమలినుని గానో చేసేవి అతడి ఆలోచనలే! అతడి ఆలోచనలు అతని స్వభావాన్ని మలుస్తాయి! మంచి ఆలోచనలు ఒకనిని ఎలా పైకి తీసుకువెళతాయో, దుష్టాలోచనలు అతనిని క్రిందికి నెడతాయి. ఒక్కొక్కసారి, ఒకే ఒక ఆలోచన ప్రపంచాన్ని పరిమార్చ గలదు, లేదా రక్షించునూ గలదు!

మంచి, చెడు శక్తులు అంతర్గతంగా అందరిలోనూ ఉన్నాయి. ఇహ ప్రపంచంలో మనం ఈదులాడున్నంత కాలం, ఈ దుష్టశక్తులు, అనుకోని సమయాల్లో, మనలను చెదరగొట్టే బలంతో, ఉపరితలానికి వస్తాయి. అర్హతత్వాన్ని పొంది ఒకసారి వాటిని పూర్తిగా నాశనం చేస్తే, మన విజ్ఞాన ప్రవంతి పూర్తిగా పరిశుద్ధమవుతుంది.

మానవాళి మధ్య ఉన్న ఎక్కువ తక్కువలకు కారణం ఏమిటి ?

ఈ అసమతౌల్య ప్రపంచాన్ని మనం ఎలా వివరించగలం ?

ఈ అసమానతలకు కారణం ఉండైనా ఉండాలి, లేదా లేకుండా ఉండాలి. కారణం లేదనుకుంటే అప్పుడది శుద్ధ యాదృచ్ఛికం అవుతుంది.

బుద్ధి ఉన్నవాడెవడూ " ఈ అసమాతలకు కారణం అంధదైవ యోగం " అనీ, " శుద్ధ యాదృచ్ఛికత " అని అనడు.


ఈ ప్రపంచంలో ఎవరికైనా, ఏదో ఒక కారణంగా, అతనికి తగిందే జరుగుతుంది. సాధారణ తెలివి ఉన్న మనుష్యులు మామూలుగా అసలు కారణాన్ని గానీ, కారణాలను గానీ గ్రహించలేరు.

దృశ్యమాన ఫలితానికి ఉన్న అదృశ్య కారణం లేదా కారణాలు, అవశ్యంఈ ప్రకృత జన్మకే చెందినవి అయి ఉండాల్సిన అవసరం లేదు. అవి దగ్గరి లేదా సుదూర పూర్వ జన్మలకు చెందినవై ఉండవచ్చు. దూర సంవేదనా గ్రహణ శక్తితో గానీ, తన సంజ్ఞానాత్మక జ్ఞానంతో గానీ, బాగా ఎదిగిన ఋషులకే, మామూలు భౌతిక నేత్రానికి చూడసాధ్యం కాని సంఘటనలను చూడడం సాధ్యమవుతుంది.

మన సుఖ దుఃఖాలకు కారణం మనమే! మన స్వర్గాన్ని మనమే సృష్టించు కుంటాం! మన నరకాన్ని మనమే సృష్టించుకుంటాం! మన కర్మకు మనమే శిల్పులం.

*" బుద్ధదర్శనం " పుస్తకం నుంచి....*

❊❊❊



ధ్యాన లహరి పబ్లికేషన్స్